

భూకబ్జాలపై ఉక్కుపాదం
భూ కబ్జాదారులపై సీపీ రంగనాథ్ ఆదేశాల తో పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. పేదలకు భరోసా కల్పిస్తున్నారు. - 8లో▸



కుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు
జనగామ జిల్లా కొడకండ్ల, వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలాల్లో గురువారం కుక్కల దాడి లో ముగ్గురికి గాయాలయ్యాయి. - 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం $37^0/24^0$
జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పాక్షికంగా ఎండగా ఉంటుంది. పొడి వాతావరణంతోపాటు రాత్రిపూట చల్లగా ఉంటుంది.



జిల్లా కేంద్రంలోని రామాలయంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు



కల్యాణం నిర్వహిస్తున్న పండితులు



కల్యాణం.. కమనీయం..

- ఘనంగా సీతారాముల కల్యాణం

భూపాలపల్లి అర్బన్: సీతారాముల కల్యాణం గురువారం జిల్లావ్యాప్తంగా అంగరంగ వైభవంగా జరిగింది. రామాలయాలు, హనుమాన్ దేవాలయాల్లో వేద పండితులు కల్యాణం ఘనంగా జరిపించారు. జిల్లాకేంద్రంలోని కోదండ రామాలయం, శ్రీ భక్తాంజనేయస్వామి దేవాలయాల్లో జరిగిన కల్యాణానికి వందల సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి దంపతులు, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి పాల్గొన్నారు. కల్యాణాన్ని భక్తులు వీక్షించే విధంగా ఏర్పాట్లు చేశారు. భక్తుల సౌకర్యార్థం పలువురు అన్నదానం, పులిహోర, రామరసం పంపిణీ చేశారు.



తాళిబొట్టు చూపిస్తున్న అర్చకుడు

రౌండ్‌కు రూ.20వేలు

జిల్లాలో జోరుగా పేకాట
- రాత్రి పగలు తేడా లేకుండా కొనసాగింపు
- జిల్లాకేంద్రంతో పాటు మండలాల్లో కూడా..
- పట్టించుకోని పోలీసులు



భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంతో పాటు సమీప మండలాల్లో రాత్రి పగలు తేడా లేకుండా పేకాట జోరుగా సాగుతోంది. ఒక్కో రౌండ్‌కు రూ.5వేల నుంచి రూ.20వేల వరకు పెట్టి ఆడుతున్నారు. సమాజంలో పెద్ద మనుషులుగా చలామణి అవుతున్న వారు సైతం పేకాటలో మునిగితేలుతున్నారు. అడవుల్లో, మారుమూల గ్రామాల్లో గుడారాలు ఏర్పాటుచేసుకుని పేకాట ఆడుతున్నారనే విషయం బహిరంగంగా మాట్లాడుకుంటున్నా పోలీసులు మాత్రం పట్టించుకోవడం లేదు. పేకాటలో ఆర్థికంగా నష్టపోతున్న వారి కుటుంబాలు తీవ్ర దీనస్థితిలోకి వెళ్తున్నాయి.

జిల్లాకేంద్రంతో పాటు గణపురం, చిట్యాల, కాటారం, మహాముత్తారం మండలాల్లోని పలు గ్రామాల్లో పేకాటరాయుళ్లు తన ఆటను కొనసాగిస్తున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా ఊరి బయట పంట పొలాల్లో, భూపాలపల్లి చుట్టుపక్కల శివారు అడవుల్లోని చెట్ల పొదల్లో, ఖాళీ ఇళ్లల్లో జూదాన్ని సాగిస్తున్నారు. పేకాట మహమ్మారి గంజాయి, గుడుంబా కంటే ప్రమాదకంగా మారింది. ఆట మాయలో పడ్డ అనేకమంది కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయి కూలీలుగా మారి దీనస్థితిలోకి వెళ్తున్నారు. గతంలో పలుమార్లు పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు జరిపితే ప్రముఖులు సైతం పట్టుబడగా మందలించి వదిలేసిన సంఘటనలు అనేకం ఉన్నాయి.

తనిఖీలు లేవు.. పట్టించుకోరు..

జిల్లాలోని అనేక గ్రామాలలో పేకాట ప్రభావం అధికంగా ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. తనిఖీలు చేయడం లేదు. పలువురు సింగరేణి కార్మికులు పేకాటకు బానిసయ్యారు. యువకులు, విద్యార్థులు సైతం ఆకర్షితులై వారి విలువైన జీవితాలను పాడుచేసుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. అప్పుడప్పుడు పోలీసులు నిర్వహిస్తున్న దాడులకు భయపడి ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటూ అధికారుల రాకను ముందే పసిగట్టే విధానాన్ని కొనసాగిస్తున్నారు. సాయంత్రం అయిందంటే పేకాటరాయుళ్లు ద్విచక్రవాహనాలపై ఇతర ప్రాంతాలకు వెళ్లుతుంటారని, కొన్ని రోజులు ఇతర ప్రాంతాల వారు మండలాలకు వస్తారని ప్రజలు తెలుపుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పేకాటను నిర్మూలించాలని ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్రాలు దాటుతున్న ఆటగాళ్లు..

తెలంగాణలో పేకాట క్లబ్‌లు లేకపోవడంతో పేకాటలో ప్రతిభ కలిగిన వారు రాష్ట్రాలు దాటి క్లబ్‌లకు వెళ్లి ఆడుతున్నారు. క్లబ్‌లలో ప్రత్యేకమైన ఆఫర్లు ఉండటంతో ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసుకొని టీంలుగా మారి మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక రాష్ట్రలకు వెళ్లి మరీ ఆడుతున్నారు. రెండు మూడు రోజుల పాటు వెళ్లి పేకాడి కొందరు రెండు, మూడు లక్షల రూపాయలను కోల్పోతున్నారు. దీంతో వారి కుటుంబాలు అప్పుల పాలై ఆస్తులు అమ్మడం లేదా తాకట్టు పెట్టి అప్పులు తీరుస్తున్నారు.

ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తాం..



డివిజన్ పరిధిలో మండలాల పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. ప్రత్యేక తనిఖీలు కూడా నిర్వహించాలని ఆదేశాలు జారీచేస్తాం. పేకాటకు బానిసలై జీవితాలను ఆగం చేసుకోవద్దు. మహమ్మారి పేకాట వలనే అనేకమంది ఆస్తులను పోగొట్టుకొని రోడ్డున పడ్డారు. పేకాట స్థావరాల సమాచారం ఎవరికైనా తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

- రాములు, డీఎస్పీ భూపాలపల్లి

ఆపదలో ఉన్నాం..

తోడుగా నిలవండి

ఒక్క పాటతో కోట్లాది మంది ప్రేక్షకుల మనస్సు కరిగించి.. కంట కన్నీరు పెట్టించిన గాయకులు వీళ్లు. కుటుంబ సంబంధ బాంధవ్యాలను తమ గానామృతంతో తెలియజేసిన వీరు ఇప్పుడు పుట్టెడు కష్టాల్లో ఉన్నారు. 'మాకంటూ సొంత బలగం లేదు.. మీరే మా 'బలగం'. మా కంట కన్నీరు తుడవండి' అని దీనంగా వేడుకుంటున్నారు. బలగం సినిమా చివరాంకంలో 'తోడుగా మాతోడుండి.. నీడగా మాతో నడిచి.. నువ్వెక్కాడెల్లినావు కొంరయ్యా..' అంటూ పాట పాడి అందరినీ కదిలించిన గాయకులు మొగిలయ్య, కొమురమ్మ దంపతులు. మొగిలయ్య.. రెండు కిడ్నీలు చెడిపోయి.. రెండు కళ్లు కనిపించక మంచానికే పరిమితమయ్యాడు. 'తోడుగా మా తోడుండి. మా ఇంటి దీపాన్ని కాపాడండి'అంటూ కొమురమ్మ రెండు చేతులు ఎత్తి అర్థిస్తోంది.

కష్టాల్లో 'బలగం'మొగిలయ్య
- రెండు కిడ్నీలు ఫెయిల్.. వారానికి మూడు సార్లు డయాలసిస్
- కనిపించని రెండు కళ్లు.. ఆపరేషన్ చేయాలంటున్న వైద్యులు
- ఆర్థికసాయానికి అర్థిస్తున్న భార్య కొమురమ్మ



ఆస్పత్రిలో డయాలసిస్ బెడ్ వద్ద మొగిలయ్య

వరంగల్ డెస్క్: వరంగల్ జిల్లా దుగ్గొండి మండల కేంద్రానికి చెందిన బుడిగజంగాల కళాకారులు పస్తం మొగిలయ్య, కొమురమ్మ దంపతులు బలగం సినిమాలో నటించి.. పాడిన పాటతో అందరి మన్ననలు పొందారు. ఇప్పుడు వారు కన్నీళ్లతో కాలం గడుపుతున్నారు. మొగిలయ్యను బతికించుకోవడానికి కొమురమ్మ సాయం చేసే చేతుల కోసం ఎదురుచూస్తోంది. బుడిగ జంగాలకు ఆస్తిపాస్తులు ఉండవు.. పొట్ట గడిస్తే చాలు. జీవనోపాధికి కళారూపాలే పెట్టుబడి. మొగిలయ్యకు తాత రామచంద్రు, తండ్రి పెంటయ్య, అన్న చనిపోయిన అనంతరం వారసత్వ ఆస్తిగా తంబూర, దిమ్మస వచ్చాయి. భార్య కొమురమ్మతో కలిసి బుర్రకథలు చెబుతూ జీవనం సాగిస్తున్నాడు. రెండేళ్ల క్రితం ఆయన కరోనా బారిన పడ్డాడు. కోలుకుని బాగానే ఉన్నాడు. ఏడాది క్రితం ఒకరోజు ఆయన కళ్లు తిరిగి పడిపోయారు. చెయ్యి విరిగింది. ఆస్పత్రికి తీసుకెళ్లి చెక్ చేయిస్తే.. కిడ్నీ సమస్య ఉందని డాక్టర్లు చెప్పారు. పరీక్షలు చేయిస్తే.. రెండు కిడ్నీలు ఫెయిలైనట్టు వచ్చింది. ఇంతకుముందు కరోనా సోకడం వల్లే మొగిలయ్య కిడ్నీలు పూర్తిగా దెబ్బతిన్నాయని డాక్టర్లు చెప్పారు. అప్పటినుంచి వారానికి మూడు రోజులు దుగ్గొండి నుంచి వరంగల్ నగరానికి వచ్చి డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఇదిలా ఉండగానే ఇటీవల కొత్త ఆరోగ్య సమస్య వచ్చిపడింది. బీపీ, షుగర్ పెరగడంతో ఆయన రెండు కళ్లపై ప్రభావం పడింది. ఇప్పుడు ఆయనకు కంటిచూపు కూడా పోయింది.

ఇప్పటివరకు రూ.14లక్షలు ఖర్చు

మొగిలయ్య వైద్యం కోసం ఇప్పటివరకు రూ.14లక్షల వరకు ఖర్చయ్యాయి. తాము సంపాదించుకున్న డబ్బుకు తోడు మరో రూ.10లక్షల వరకు అప్పు చేసినట్లు భార్య కొమురమ్మ తెలిపింది. ఇక కళ్లు మళ్లీ కనిపించాలంటే రెండుసార్లు సర్జరీ చేయాల్సి



ఉంటుందని వైద్యులు తెలిపారు. ఇందుకు దాదాపు రూ.3లక్షల దాకా అవసరమవుతాయని, కానీ అంత డబ్బు మొగిలయ్య దగ్గర లేదు. బలగం డైరెక్టర్ వేణు కొంత సాయం చేసినా.. సరిపోని పరిస్థితి.

మనసున్న మారాజులు ఆదుకోండి

ఇప్పటివరకు సంపాదించిన డబ్బులకు తోడు అప్పులు చేసి నా భర్తకు వైద్యం చేయించాను. ఇప్పుడు చేతిలో చిల్లిగవ్వ లేదు. వారానికి మూడు రోజులు వరంగల్ సంరక్ష ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీకింద డయాలసిస్ చేయిస్తున్నాం. నెలకు మందులకే రూ8వేల దాకా ఖర్చు వస్తుంది. రెండు కళ్లు పూర్తిగా పోయాయి. మళ్లీ కనిపించాలంటే ఒక్కో కంటికి రెండు సార్లు ఆపరేషన్ చేయాలని వైద్యులు చెప్పారు. మనసున్న మారాజులు ఆదుకోవాలని రెండు చేతులు ఎత్తి ప్రార్థిస్తున్నా.

- మొగిలయ్య భార్య, కొమురమ్మ

ఆర్థికసాయం చేయదల్చిన వారు

పస్తం కొమురమ్మ బ్యాంక్ అకౌంట్ నంబర్:
62306309034
స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా,దుగ్గొండి, వరంగల్ జిల్లా.
ఐఎఫ్ఎస్సీ కోడ్ : SBIN0020655

గూగుల్‌పే నంబర్ : 90590 98236
ఫోన్‌పే నంబర్ : 91772 54408



న్యూస్‌రీల్

నేడు బార్ అసోసియేషన్ ఎన్నికలు

భూపాలపల్లి అర్బన్: జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికలు జిల్లా ప్రధాన కోర్టు ఆవరణలో శుక్రవారం నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలో జిల్లా ప్రధాన కోర్టుతో పాటు సీనియర్ సివిల్ కోర్టు, జూనియర్ సివిల్ కోర్టులు ఏర్పాటైన తర్వాత మొదటిసారి బార్ అసోసియేషన్ ఎన్నికలు జరుగుతున్నాయి. ఇంతకుముందు న్యాయవాదులందరూ కలిసి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిని తాత్కాలికంగా ఎన్నుకున్నారు. నేడు అధికారికంగా న్యాయవాదులు బ్యాలెట్ పద్ధతి ద్వారా ఎన్నుకోనున్నారు. మొత్తం 50మంది సభ్యులు ఉన్నారు. ఇందులో రెండు ప్యానళ్ల నుంచి పోటీ చేయటానికి ఆశావహులు సిద్ధమయ్యారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవి కోసం న్యాయవాదులు చల్లూరు మధు, ఎం.రవీందర్, ఎదులాపురం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులుగా పగడాల ఆనందరావు, బర్ల మహేందర్, కునూరు సురేష్‌కుమార్ పోటీ పడుతున్నారు. ఉపాధ్యక్ష పదవి కోసం ఇద్దరు, ప్రధాన కార్యదర్శి పదవి కోసం ముగ్గురు పోటీ పడుతున్నట్లు సమాచారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.


కేయూ దూర విద్య పీజీ పరీక్షల షెడ్యూల్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, అదిలాబాద్ జిల్లాల్లో దూరవిద్య పీజీ కోర్సుల (2022)ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ మ్యాథ్స్, రూరల్ డెవలప్‌మెంట్, హెచ్‌ఆర్‌ఎం, ఎల్‌ఎల్‌ఎం ప్రథమ సంవత్సరం పరీక్షలు ఏప్రిల్ 12నుంచి నిర్వహించనున్నట్లు అధికారులు మల్లారెడ్డి, నరేందర్‌లు తెలిపారు. ఫైనలియర్ పరీక్షలు ఏప్రిల్ 13వ తేదీనుంచి జరగనున్నట్లు పేర్కొన్నారు. పీజీ కోర్సుల ప్రథమ సంవత్సరం పరీక్షలు ఏప్రిల్ 12, 15, 18, 20, 24 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు. ఫైనలియర్ విద్యార్థులకు ఏప్రిల్ 13, 17, 19, 21, 25 తేదీల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉంటాయని పేర్కొన్నారు.

ఎంబీఏ మొదటి సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఎంబీఏ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలు రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలు (2022-2023) ఏప్రిల్ 11వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు అధికారులు పి.మల్లారెడ్డి, డాక్టర్ రాధిక తెలిపారు. ఏప్రిల్ 11, 13, 15, 17, 19, 21, 24 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

అలరించిన స్పిక్‌మేకే



కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన స్పిక్‌మేకే కల్చరల్ ప్రోగ్రాం అలరించింది. ప్రముఖ సితార్ వాయిద్యకారుడు ధృవ్‌బేడీ, తబలా ప్లేయర్ మహ్మద్ నజీముద్దీన్ ఖాద్రీలు తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. నిట్‌లోని స్పిక్‌మేకే (సొసైటీ ఫర్ ది ప్రమోషన్ ఆఫ్ ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్ అండ్ కల్చర్ ఎమంగ్స్ యూత్) యువతకు మన సంస్కృతీ సంప్రదాయాలను, ప్రాచీన కళలకు పునర్‌వైభవం తీసుకువచ్చే వేదికగా ఏర్పాటు చేసినట్లు నిట్ రిజిస్ట్రార్ గోవర్ధన్‌రావు తెలిపారు. కార్యక్రమంలో డీన్ ఫ్యాకల్టీ అఫైర్స్ కామేశ్వర్‌రావు, ప్రొఫెసర్ వైఎస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఎర్ర జెండా

పరకాల: ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా భారత కమ్యూనిస్టు పార్టీ ప్రజాపోరు యాత్ర చేపట్టినట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆ పార్టీ చేపట్టిన పాదయాత్ర పరకాల పట్టణానికి గురువారం చేరుకుంది. కార్యకర్తలు ఎర్ర జెండాలు చేతబూని, డప్పుచప్పుళ్లతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ తొమ్మిదేళ్ల పరిపాలనలో కేసీఆర్ సర్కార్ ప్రజలకిచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోలేకపోయిందని మండిపడ్డారు.

రూ.4కోట్ల నిధులు మంజూరు

- ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో అంబేద్కర్ సెంటర్ నుంచి జంగేడు వరకు రోడ్డు వెడల్పు, డ్రెయినేజీ నిర్మాణం , సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులకు రూ.4కోట్ల నిధులు మంజూరైనట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను నిధులు కావాలని కోరగా సీఎస్‌ఆర్ నిధుల నుంచి వెంటనే రూ.4కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ప్రత్యేక చొరవ చూపిన రాష్ట్ర ఐటీ, మున్సిపాలిటీ శాఖ మంత్రి కేటీఆర్‌కు, సింగరేణి సంస్థకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్మాణంతో భూపాలపల్లి జంగేడు రోడ్డుకు ప్రత్యేక శోభ వస్తుందని, పట్టణ ప్రజలకు రవాణా సౌకర్యవంతంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

నిట్‌తో వేసువియాస్ ఎంఓయూ

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌తో యూకేలోని వేసువియాస్ ఇండియా లిమిటెడ్ సంస్థ గురువారం ఒప్పందం కుదుర్చుకుంది. డైరెక్టర్ ఎన్వీ.రమణారావు, వేసువియాస్ సంస్థ సీఎస్‌ఆర్ ఇనిషియేటివ్ మేనేజర్ రాజశ్రీదాస్‌లు పరస్పరం ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ ఎంఓయూ ద్వారా నిట్‌కు చెందిన మెకానికల్, బెటలర్జీ, కెమికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ముగ్గురు బీటెక్ విద్యార్థినులకు సెకండియర్ నుంచి ఫైనలియర్ వరకు వేసుమియాస్ స్కాలర్‌షిప్ ఆరు నెలల ఇంటర్న్‌షిప్‌ను అందజేస్తుందని నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు తెలిపారు.

అభివృద్ధి చేయడంలో నిర్లక్ష్యం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

టేకుమట్ల(రేగొండ): వెనకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు శ్రీనివాసరావు అన్నారు. గురువారం రేగొండ మండలంలో ఏర్పాటుచేసిన సీపీఐ ప్రజాపోరు యాత్రలో ఆయన మాట్లాడారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ, ములుగులో గిరిజన యూనివర్సిటీ, కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ తెస్తామని చెప్పిన నేతలు వాటి ఏర్పాటుకు ఇప్పటి వరకు కృషి చేయడం లేదన్నారు. ఉమ్మడి వరంగల్‌లో ఏర్పడిన కొత్త జిల్లాల్లో అభివృద్ధి జరగడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా అభివృద్ధిపై పాలకులు దృష్టి పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయ్‌సారథి, కర్రె భిక్షపతి, మేకల రవి, మల్లికార్జున్‌రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు నేతులూరి జ్యోతి, మండల నాయకులు పెంట రవి, మామిడాల సమ్మిరెడ్డి, అన్నారపు రాజేందర్, పైల్ల శాంతికుమార్, గుర్రాల రవీందర్ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం కేసీఆర్, మంత్రి సత్యవతి రాథోడ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గిరిజన కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు

హన్మకొండ: గిరిజన కాంట్రాక్ట్ ఉపాధ్యాయులకు 12 నెలల జీతాన్ని ఇచ్చేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సందర్భంగా గురువారం హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం కేసీఆర్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ చిత్రపటానికి ఆ ఉపాధ్యాయులు క్షీరాభిషేకం చేశారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ గత 18 ఏళ్లుగా సంవత్సరానికి 9 నెలలు మాత్రమే జీతం ఇచ్చే వారన్నారు. తమ పోరాటాలు, వినతులకు ప్రభుత్వం పరిష్కారం చూపిందన్నారు. కార్యక్రమంలో గిరిజన కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు భూక్యా తిరుపతి, ఉపాధ్యాయులు లావుడియా హరిలాల్, లక్ష్మణ్, పార్వతి బాయి, సుజాత, శ్రీరామ్, లత, కల్పన, తిరుపతి, రాజన్న పాల్గొన్నారు.



బీఆర్ఎస్ నేతపై హత్యాయత్నం


గాయాల పాలైన రవిచంద్ర

మహబూబాబాద్ రూరల్ : కుటుంబ కలహాలతో బీఆర్ఎస్ మహబూబాబాద్ పట్టణ యూత్ జనరల్ సెక్రటరీ బోగ రవిచంద్రపై సిగ్నల్ కాలనీలో గురువారం రాత్రి హత్యాయత్నం జరిగింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని లెనిన్ నగర్ ప్రాంతంలో నివాసం ఉండే రవిచంద్ర భార్య కుటుంబ కలహాల కారణంగా కొద్ది రోజుల క్రితం సిగ్నల్ కాలనీలోని ఆమె తల్లిగారింటికి వెళ్లింది. గురువారం సాయంత్రం సమయంలో రవిచంద్ర అక్కడకు వెళ్లారు. కొంత సమయం తరువాత వారు అతడిని కొట్టుకుంటూ బయటకు తీసుకువచ్చారు. ఆ వెంటనే భార్య తరపు బంధువులు ఐదుగురు రోడ్డుపై పడవేసి బ్యాట్లు, కర్రలతో మూకుమ్మడిగా దాడిచేశారు. అంతేకాకుండా బుల్లెట్ ద్విచక్ర వాహనాన్ని అతడి మీదుగా ఎక్కించారు. అప్పటికే తీవ్ర గాయాలతో రవిచంద్ర కింద పడిపోగా బండ రాయితో తలపై మోదారు. చావుబతుకుల మధ్య ఉన్న రవిచంద్రను 108లో మానుకోట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. టౌన్ సీఐ వై.సతీష్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

యువతి అదృశ్యం



దుగ్గొండి: ఇంట్లో నుంచి బయటికి వెళ్లి యువతి అదృశ్యమైన సంఘటన మండల పరిధిలోని గుండ్ల పహాడ్‌లో గురువారం జరిగింది. ఎస్సై సురేష్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన యువతి పొన్నాల కావ్య మూడు రోజుల క్రితం కళాశాల నుంచి ఇంటికి వచ్చింది. తల్లిదండ్రులకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో నర్సంపేట ఆస్పత్రికి వెళ్లి తిరిగి ఇంటికి చేరుకున్నారు. ఇంటికి రాగానే ఇంట్లో కూతురు కనిపించలేదు. ఇరుగు, పొరుగు వారిని, బంధువులను అడిగి తెలుసుకున్నారు. ఆచూకీ లభించకపోవడంతో యువతి తండ్రి కుమార్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు.

రెడ్డి చికెన్ సెంటర్
Cell: 9989299661

WANTED TEACHERS
St. Francis E/M High SCHOOL
Vill & Mdl: Velair, Dist: Hanamkonda
Wanted Qualified Teachers with fluency in English
• TELUGU • HINDI • MATHS
• EVS • SCIENCE (BIO-PHY-SCI) • PET
• SOCIAL STUDIES
• COMPUTERS • BUS DRIVERS & CLEANERS
To Teach the Classes Nursery to X
For more Details:
Cell: 6304958915

MONTFORT SCHOOL - CBSE
Affiliated to CBSE, New Delhi - Affiliation No. 3630357
Darga Road, Fathimanagar, Kazipet, Hanamkonda
Ph: 7901011255, Email id: montfortkazipet@gmail.com
WALK-IN-INTERVIEW
INTERVIEW & DEMO ON 02-04-2023, TIMINGS: 9-00am
High School : English & Social, Chemistry, Hindi, Maths, Physics, Biology
Primary : English & Social, Science & Maths, Hindi, Science, Telugu, Computer Teacher
Non-Teaching: Art & Craft, Librarian, PET (Female)

భూకబ్జాలపై ఉక్కుపాదం

కార్పొరేటర్ భర్తతో సహా నలుగురిపై కేసు నమోదు
- రిమాండ్‌కు తూర్పాటి సారయ్య, శ్రీను
- పరారీలో మాజీ కారోబార్ రఘు, హరిప్రసాద్
- జంగం రాజు, గండ్రతి భాస్కర్‌ను బైండోవర్ చేసే అవకాశం
- సీపీ చర్యలతో ఏనుమాములలో హర్షాతిరేకాలు


సీపీ రంగనాథ్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న భూ బాధితులు

వరంగల్: భూ కబ్జాదారులపై సీపీ రంగనాథ్ ఆదేశాలతో పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. పేదలకు భరోసా కల్పిస్తున్నారు. ఇటీవల సీపీ విధుల్లో చేరినప్పటి నుంచి పలు భూ కబ్జాలకు చెందిన కేసులను పరిష్కరించి బాధితులకు న్యాయం చేశారు. తాజాగా నగర శివారులోని ఏనుమాముల 14వ డివిజన్ కార్పొరేటర్ తూర్పాటి సులోచన భర్త మాజీ జెడ్పీటీసీ సారయ్య, కుమారుడు తూర్పాటి హరిప్రసాద్, మాజీ కారోబార్ తూర్పాటి రఘు, తూర్పాటి శ్రీనివాస్‌లపై భూ ఆక్రమణలకు పాల్పడినట్లు తేలడంతో వారిపై కేసులు నమోదు చేసినట్లు ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ ఎ.మహేందర్ తెలిపారు. మరో ఇద్దరు జంగం రాజు, గండ్రతి భాస్కర్‌లపై విచారణ కొనసాగుతుండగా కేసులు నమోదు చేసిన వారిలో మాజీ కారోబార్ రఘు, హరిప్రసాద్‌లు పరారీలో ఉన్నట్లు తెలిపారు. అదుపులోకి తీసుకున్న తూర్పాటి సారయ్య, శ్రీనివాస్‌లను కోర్టులో హాజరు పర్చి రిమాండ్‌కు గురువారం సాయంత్రం తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

ఏనుమాముల ప్రాంతంలో కబ్జాలపై..

మూడు రోజులుగా ఏనుమాముల ప్రాంతంలో భూ ఆక్రమణలపై క్షేత్ర స్థాయిలో విచారించిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు అక్రమాలు నిజమని తేలడంతో కేసులు నమోదు చేసేందుకు ఏనుమాముల పోలీసులకు నిందితులను అప్పగించారు. ఈ దందాలో కార్పొరేటర్ భర్త తూర్పాటి సారయ్య, మాజీ కారోబార్ తూర్పాటి రఘు, తూర్పాటి శ్రీను, జంగం రాజు, గండ్రతి భాస్కర్‌లకు ప్రమేయం ఉన్నట్లు నిర్ధారించారు. బుధవారం టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో చేపట్టిన విచారణకు తూర్పాటి సారయ్య, తూర్పాటి శ్రీను, జంగం రాజు, గండ్రతి భాస్కర్‌లు హాజరు కాగా మాజీ కారోబార్ తూర్పాటి రఘు, హరిప్రసాద్‌లు ఆరోగ్య కారణాలు చూపి గైర్హాజరయ్యారు. రాజు, భాస్కర్‌లు అప్రూవర్లుగా మారి మరోసారి భూ దందాలకు వెళ్లమని వెళ్తే ఏశిక్షకు అయినా సిద్ధమని సీపీతో ప్రాధేయపడినట్లు తెలిసింది. దీంతో వారిని తహసీల్దార్ ఎదుట హామీ పత్రాలను తీసుకుని బైండోవర్ చేయాలని, సారయ్య, రఘు, శ్రీను, హరిప్రసాద్‌లపై కేసులు నమోదు చేసి రిమాండ్ చేయాలని సీపీ ఏనుమాముల పోలీసులను ఆదేశించినట్లు సమాచారం. అదుపులో ఉన్న సారయ్య, శ్రీనులకు ఆరోగ్య వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం కోర్టులో హాజరు పర్చి రిమాండ్‌కు తరలించారు.

పరారీలో మాజీ కారోబార్

ఏనుమాముల భూ దందాలతో సంబంధం ఉన్న మాజీ కారోబార్ తూర్పాటి రఘు పరారీలో ఉన్నట్లు తెలిసింది. మంగళవారం తెల్లవారుజామున టాస్క్‌ఫోర్స్ పోలీసులు కార్పొరేటర్ భర్త సారయ్య, రఘు, శ్రీను, రాజు, భాస్కర్‌లను అదుపులోకి తీసుకుని విచారించారు. అదే రోజు రాత్రి ఇంటికి పంపి ఉదయం క్షేత్ర స్థాయిలో విచారణ అనంతరం మరో సారి కార్యాలయానికి రావాలని చెప్పి వదిలేశారు. ఇంటికి వచ్చిన అనంతరం రఘు పరారీ అయినట్లు పోలీసులు గుర్తించారు. బుధవారం జరిగిన విచారణకు నలుగురు హాజరు కాగా రఘు మాత్రం రాకపోవడంతో ప్రత్యేక పోలీసు బృందం అతన్ని పట్టుకునేందుకు రంగంలోకి దిగింది. విచారణకు వచ్చిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఉన్నతాధికారులకు ఏనుమాములలోని పలువురు భూ బాధితులు పదుల సంఖ్యలో ఫిర్యాదులు ఇవ్వడంతో రఘు ప్రమేయం ఎక్కువగా ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. ఈ విషయాన్ని గుర్తించిన రఘు, హరిప్రసాద్‌లు పరారీలోకి వెళ్లి కోర్టులో లొంగిపోయేందుకు లేదా ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది.

ఏనుమాములలో హర్షాతిరేకాలు..


కార్పొరేటర్ భర్త సారయ్యను అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

ఏనుమాముల 14వ డివిజన్‌లో భూ ఆక్రమణలకు పాల్పడిన కబ్జా గ్యాంగ్‌లపై కేసులు నమోదు చేసేందుకు వరంగల్ పోలీసు కమిషనర్ రంగనాథ్ ఆదేశించారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో గురువారం ఉదయం బాలాజీనగర్ జంక్షన్, 100 ఫీట్ల రోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లో సీపీ రంగనాథ్ ఫ్లెక్సీలకు బాధితులు పాలాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ తమ భూములను కబ్జా చేస్తే ఎవరూ పట్టించుకోలేదని.. సీపీ రావడంతో కబ్జాలపై కన్నెర్ర చేయడంతో పాటు గ్యాంగ్‌ల్లో ముఖ్యులపై కేసులు నమోదు చేయడంతో పేదల భూములకు రక్షణ ఏర్పడిందన్నారు. ఏనుమాములతో పాటు 100ఫీట్ల రోడ్డు, కోటి లింగాల గుడి ప్రాంతాల్లో ఇలాంటి గ్యాంగ్‌లు వందల గజాల ప్లాట్ల యజమానులను బెదిరింపులకు గురిచేస్తూ ఆక్రమించుకోవడం, డబ్బులు వసూళ్లు చేస్తున్నారని.. ఇయ్యాని వారి భూముల్లో ప్రహరీలు నిర్మిస్తున్నారని తెలిపారు. నగరంలో సాగుతున్న భూ దందాలపై ప్రత్యేకంగా నిఘా వర్గాలతో విచారణ జరిపిస్తే వందల కోట్ల రూపాయల దందా బయటపడే అవకాశాలు ఉన్నట్లుగా పలువురు చెబుతున్నారు.

కుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు


గాయపడ్డ ముత్యాలు


గాయపడ్డ సంపత్


ఉమారెడ్డి

కొడకండ్ల/వర్ధన్నపేట: కుక్కల దాడిలో ముగ్గురు గాయాలపాలయ్యారు. కొడకండ్ల మండల పరిధిలో ఇద్దరు గాయపడగా వర్ధన్నపేట మండల పరిధిలో ఓ దివ్యాంగుడు గాయపడ్డాడు. వివరాల్లోకి వెళ్తే..జనగామ జిల్లా కొడకండ్ల మండల కేంద్రానికి చెందిన వల్లూరి ముత్యాలు ఉదయం ఇంటి ఎదుట వాకిలి ఊడుస్తున్న క్రమంలో కుక్క చాతి, చేతిపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. అదే విధంగా రాయపురం సంపత్ సైకిల్‌పై వెళ్తుండగా మరో కుక్క దాడి చేయడంతో గాయపడ్డాడు. ముత్యాలను ఎస్సీ కాలనీ వాసులు వెంటనే పీహెచ్‌సీకి తరలించగా.. సంపత్ సైతం ఆస్పత్రికి చేరుకున్నాడు. ఆస్పత్రిలో సిబ్బంది లేకపోవడంతో చాలాసేపు కూర్చున్నారు. అనంతరం ఏఎన్ఎం వచ్చి ప్రథమ చికిత్స చేసిన అనంతరం ఇద్దరిని జనగామ ఏరియా ఆస్పత్రికి 108 అంబులెన్స్‌లో తరలించారు. అదే విధంగా వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండల పరిధిలోని కట్య్రాల గ్రామానికి చెందిన ఉమారెడ్డి మానసిక దివ్యాంగుడు. ఆయన వీధిలో నుంచి తన ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా వీధి కుక్కలు వెంట పడి దాడి చేయడంతో గాయాలయ్యాయి. వెంటనే చుట్టు పక్కల వారు కుక్కలను తరిమివేశారు. అనంతరం అతన్ని చికిత్స నిమిత్తం వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఉన్నతాధికారులు స్పందించి కుక్కల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బైక్ చలానా తొలగింపు



ఆన్‌లైన్‌లో జరిమానాను తొలగించిన పోలీసులు



సాక్షిలో వచ్చిన కథనం

సాక్షి ఎఫెక్ట్..

జనగామ: హైదరాబాద్ ఎల్‌బీనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో స్థానిక పోలీసులు పొరపాటున జనగామకు చెందిన పబ్బా సంపత్ పేరిట పంపించిన జరిమానా చలానాను ఆన్‌లైన్ నుంచి తొలిగించారు. 'బైక్ ఒకరిది.. జరిమానా మరొకరికి' శీర్షికన ఈ నెల 28న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సంపత్‌కు చెందిన(టీఎస్ 27సీ4258) ద్విచక్రవాహనానికి రూ.700 జరిమానా వేశారు. ఎల్‌బీనగర్ పరిధిలో పట్టుబడిన స్కూటీకి బదులుగా సంపత్ వెహికిల్‌పై జరిమానా వేసినట్లు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. దీనిపై డీజీపీకి ఫిర్యాదు చేయడంతో పోలీసులు స్పందించి తనకు వచ్చిన ఫేక్ చలానాను ఆన్‌లైన్ నుంచి తొలిగించారని సంపత్ తెలిపారు.

నడిరోడ్డుపై కత్తులాట..

- యువకుడిపై మద్యం మత్తులో కత్తితో దాడి
- క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలింపు
- బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు

ఖిలా వరంగల్: నడిరోడ్డుపై కత్తులతో యువకులు రెచ్చిపోతున్నారు. చిన్న గొడవను పెద్దగా చేసుకుని కత్తులతోనే సయ్యాటలు ఆడుతున్నారు. మద్యం, గంజాయి మత్తు యువతను ముంచెత్తుతోంది. ఆ మత్తులో ఎవరు ఏమి చేస్తున్నారో తెలియని పరిస్థితి. ఇదే రకమైన ఘటనలు ఇటీవల ఎక్కువగా ఫోర్ట్‌రోడ్డు, జన్మభూమి జంక్షన్, శంభునిపేట జంక్షన్‌లో జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. తాజాగా గురువారం ఉదయం ఫోర్ట్‌రోడ్డులోని ఓ బేకరి షాపు ఎదుట ఖిలా వరంగల్ పడమరకోటకు చెందిన నర్మెట్ట రాజు బైక్ పార్క్ చేసి బేకరి లోపలికి వెళ్లాడు. ఫోర్ట్‌రోడ్డుకు చెందిన రమేష్ పార్క్ చేసిన బైక్‌ను కాళ్లతో తన్నేశాడు. బైక్ కిందపడిపోగా అక్కడే ఉన్న నర్మెట్ట రాజు అతన్ని నిలదీశాడు. నన్నే నిలదీస్తావా.. అంటూ దుర్భాషలాడుతూ తన వద్ద ఉన్న కత్తితో దాడిచేశాడు. దీంతో మెడ, కడుపు భాగంలో గాయాలయ్యాయి. అక్కడే ఉన్న స్థానికులు మద్యం మత్తులో ఉన్న యువకుడిని అడ్డుకుని క్షతగాత్రున్ని కాపాడే ప్రయత్నం చేశారు. గాయపడిన యువకుడిని స్థానికులు తాత్కాలిక చికిత్సను అందజేసి ఎంజీఎం ఆసుపత్రికి ఆటోలో తరలించారు. అంతకంటే ముందు బాధితుడు నర్మెట్ట రాజు మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా గురువారం కత్తితో దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కుమార్ తెలిపారు.

'అక్షర సుగంధం' నమిలికొండ ఇకలేరు..

- ప్రముఖ న్యాయవాది, సీనియర్ కవి బాలకిషన్‌రావు మృతి


నమిలికొండ బాలకిషన్‌రావు(ఫైల్)

హన్మకొండ కల్చరల్: ప్రముఖ న్యాయవాది, ఆధునిక సాహిత్య వేదిక 'ప్రసారిక'మాస పత్రిక సంపాదకులు, సీనియర్ కవి నమిలికొండ బాలకిషన్‌రావు(73) గురువారం మధ్యాహ్నం హనుమకొండలోని రోహిణి ఆస్పత్రిలో మృతి చెందారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆయన ఇంటికే పరిమితమయ్యారు. హనుమకొండలోని రాగన్నదర్వాజలో ఉండే బాలకిషన్‌రావు ఆనాటి తరానికి, నేటి తరానికి ఆదర్శం. సాహితీ సమితి ఏర్పాటు చేసి పలు సాహిత్య సమావేశాలు నిర్వహించారు. 1982లో ప్రసారిక సాహితీ పత్రికను స్థాపించి యువ రచయితలను ప్రోత్సహించారు. 1986లో వరంగల్ జానపద సాహిత్య పరిషత్ ఉపాధ్యక్షులుగా, చైతన్య సాహితీ సంస్థకు కార్యదర్శిగా, వరంగల్ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షులుగా పనిచేశారు. పోతనపీఠం కార్యదర్శిగా, కాళోజీ ఫౌండేషన్, రాజరాజనరేంద్రాంధ్ర భాషా నిలయం సభ్యులుగా సేవలందించారు.

కవితా సంపుటాలు.. వ్యాసాలు

యువస్వరం, అక్షరచిత్రాలు, శాంతిసమత, అక్షరాలలో అనంతం, మా విరసం తదితర కవితా సంపుటాలను వెలువరించారు. దీంతో పాటు ప్రసారికలో వరుసగా రచయితను, కవులను పరిచయం చేస్తూ వ్యాసాలను కూడా ప్రచురించారు. ఆ విధంగా అక్షరప్రతిబింబం, ప్రసారకీయ కుసుమాలు, నివాళి, చుక్కపొడుపు, యువస్వరం, శాంతిసమత తదితర పుస్తకాలను వెలువరించారు. బాలకిషన్‌రావు రచనలపై నమిలికొండ బాలకిషన్‌రావు కవితా దర్పణం, కాలం వెంట నడచి వస్తున్న నబారా.. వంటి విమర్శక గ్రంధాలు కూడా ఉన్నాయి. అముద్రిత రచనలు కూడా ఉన్నాయి. స్పందించే హృదయం ఉంటే బతుకంతా పరిమళభరితమేనని, కదిలించే కవనం ఉంటే ప్రకృతి నవవసంతమని భావించే నమిలికొండ 2009 నుంచి 2013 వరకు 30కి పైగా ప్రసారిక సంచికలలో తాను రాసిన సంపాదకీయ వ్యాసాలను అక్షరసుగంధం పేరిట ప్రచురించారు.

సాహితీవేత్తల సంతాపం

కేంద్రసాహిత్య అకాడమి అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్, సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్షకార్యదర్శులు గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు, డాక్టర్ ఎన్వీఎన్ చారి, కుందావజ్జుల కృష్ణమూర్తి, వనం లక్ష్మీకాంతారావు, ప్రముఖ కవి పొట్లపల్లి శ్రీనివాస్‌రావు, వరంగల్ పోతన విజ్ఞాన పీఠం మేనేజర్ జేఎస్ శర్మ, కమిటీ సభ్యులు, పద్యనాటక కళాకారులు జూలూరు నాగరాజు, శ్రీలేఖ సాహితీ కార్యవర్గ సభ్యులు డాక్టర్ టి. శ్రీరంగస్వామి తదితరులు ఆయన మృతి పట్ల సంతాపం తెలిపారు. ఆయన మరణం సాహితీ ప్రపంచానికి తీరని లోటని ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PROPERTY FOR SALE

■374 Sq.yds G+1 House SBH Colony Near Collector Office, NIT CLG, 2BHK Flats Near KUC 'X' Road, Alankar Warangal. Cell: 7989106048. [W-785469]

PLOT FOR SALE

■GWMC - KUDA పరిధిలోని 3800 చ॥గ॥ ఏనుమాముల మార్కెట్ మేన్‌గేట్‌కి ఎదురుగా 2 సైడ్ రోడ్స్ ఫేసింగ్ భూమి అమ్మకానికి కలదు. సంప్ర॥ 9440290009, 9441689294. [W-785507]

■DTCP అనుమతి పొంది భూపాలపల్లికి అతి చేరువలో గల వెంచర్‌లో సులభ వాయిదాల పద్ధతిలో ప్లాట్లు అమ్మబడును. మార్కెటింగ్ చేయుటకు ఏజెంట్స్ కావలెను. 9951997435, 9666770246. [M-1190706]

SERVICES

■వ్యక్తిగత, వ్యాపారం, వ్యవసాయ ఆస్తి, టేక్‌ఓవర్ లోన్స్, NPA కేసులు తక్కువ సిబిల్ స్కోర్ కూడా రుణానికి వర్తిస్తాయి. సంప్రదించండి: 94630 26237. [T-1801]

■అతి తక్కువ వడ్డీతో ఇల్లు, వ్యక్తిగత, టేక్ ఓవర్, మార్టిగేజ్ లోన్స్ కలవు. CIBIL స్కోర్ తక్కువ ఉన్న ఫైనాన్స్ ఇవ్వబడును. ఏజెంట్లు కావలెను. ✆ 8699691739. [T-1792]

LOANS

■సులభంగా లోన్ పొందండి. అతి తక్కువ వడ్డీతో, అన్ని రకాల లోన్స్, ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు, వైద్యులు (NRI) సంప్ర॥ JS ఎంటర్‌ప్రైజెస్, ఖమ్మం. భద్రాద్రి కొత్తగూడెం. 8520970781, 7842890781. [M-1190705]

తాజా వార్తల కోసం లాగిన్ అవ్వండి www.sakshi.com

CHANGE OF NAME

■RUBINA AKBAR MISTRY (New Name) previously called BAGHADIYA RUBINABEN SUBHANALI (Old Name) W/o: Akbar Mistry doing House Wife and resident of H.No.8-9-159, Khoja Mohalla, Govindarajula Gutta, Warangal Dist - 506002, Telangana State, India solemnly declare. [W-785471]

■AKBAR MISTRY (New Name) previously called AKBAR ALLAUDDIN MISTRY (Old Name) S/o: Allauddin Mistry doing Business and resident of H.No.8-9-159, Khoja Mohalla, Govindarajula Gutta, Warangal Dist - 506002, Telangana State, India solemnly declare. [W-785470]

WANTED

■త్రివేణి రె॥ కాలేజ్ (హన్మకొండ) కావలెను: వంటమాస్టర్ (M), మేల్ వార్డెన్స్, లేడీ వార్డెన్స్, జూ॥లెక్చరర్స్ - MAT, Phy, Chem, Bot, Zool, సీనియర్ లెక్చరర్స్ (M), Computer Operator (M) Cell: 9949610729. [WA-6932]

■డ్రైవర్స్ కావలెను, టోయింగ్ ట్రక్‌కి బెంగుళూరులో పని చేయుటకు మంచి జీతం+ రూం+ అలవెన్స్. సంప్ర॥ 9948434745, 9000687574. [WA-504]

■ఇంటిలో ఉదయం, సాయంత్రం వంట చేయుటకు ఆడ వంట మనిషి వెంటనే కావలెను. సాలరీ: 4000-5000/- వివరాలకు సంప్ర॥ 9000286625. [W-785467]

■వరంగల్, హన్మకొండ లోకల్‌లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్ స్త్రీ/పు॥ అర్జెంటుగా కావలెను. సాలరీ: 12000-15000. సంప్ర॥ 8688072125 [W-785468]

■త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్దులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం, జీ: 18K ఏజెంట్ కమీషన్ 6K ఫోన్: 9848571888. [H-793404]

■MEGA GROUP MAN POWER & Security సంస్థ విస్తరణలో భాగంగా AP & TS లలో జిల్లాల వారీగా ఈ ఫీల్డ్‌లో అనుభవమున్న వారికి ఫ్రాంచైజ్ ఇవ్వబడును. (పెట్టుబడి లేదు). సెల్: 70326 10569, 70931 25169. [NA-5468]

■ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం॥ 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-795295]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/-రూ॥ అదనపు లైను 60/-రూ॥లు మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ 9010144453
వరంగల్ 9705748198
నర్సంపేట 9010144453
జనగామ 9951602871
మహబూబాబాద్ 9010144453
జయశంకర్ భూపాలపల్లి 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి


ఎల్లయ్య(ఫైల్)

చిన్నగూడూరు: తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండల పరిధిలోని విస్సంపల్లిలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. విస్సంపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు బొమ్మకంటి ఎల్లయ్య(62) కులవృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజు వారి వృత్తిలో భాగంగా గురువారం ఉదయం తాటి చెట్టు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, బీ ఆర్ఎస్ నాయకులు జిల్లా వైద్యశాలలో మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యుల కు సంతాప సానుభూతి తెలిపారు. మృతుడికి భా ర్య చిలకమ్మ, ఒక కూ తురు, ముగ్గురు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి..


ప్రణయ్‌రెడ్డి (ఫైల్)

ఎస్ఎస్‌తాడ్వాయి: హైదరాబాద్‌లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల పరిధిలోని గంగారం గ్రామానికి చెందిన కొడిమల ప్రణయ్‌రెడ్డి(26) దుర్మరణం చెందాడు. వివరాల్లోకి వెళ్తే..గ్రామానికి చెందిన ప్రణయ్‌రెడ్డి తండ్రి మల్లారెడ్డి సమారుగా 20 ఏళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆయన అచూకీ ఇప్పటి వరకు లభించలేదు. ఐదేళ్ల క్రితం ప్రణయ్‌రెడ్డి తల్లి ఉమాను తీసుకుని జీవనోపాధి కోసం హైదరాబాద్ వెళ్లాడు. హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. కంపెనీకి వెళ్లి పని ముగించుకుని రూంకు వస్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ప్రణయ్‌రెడి మరణంతో తల్లి రోదనలు మిన్నంటాయి. ఆయన మృతితో గంగారంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వాహనం ఢీకొని..


మృతి చెందిన శ్రీను

పర్వతగిరి: వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. సంఘటన పర్వతగిరి మండల పరిధిలోని ముంజాలకుంటతండాలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జాటోతు శ్రీను(38)ను గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ క్రమంలో శ్రీను తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై తెలిపారు.

యువకుడిని కాపాడిన పోలీసులు


జంపరాజును కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

వర్ధన్నపేట: ఆత్మహత్యాయత్నానికి పాల్పడబోతున్న ఓ యువకుడిని వర్ధన్నపేట పోలీసులు కాపాడి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సంఘటన గురువారం వర్ధన్నపేట పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్సై రామారావు కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా తొర్రూరుకు చెందిన సిరిగిరి జంపరాజు కుటుంబ తగాదాలతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకోవడానికి ఇంటి నుంచి తన బైక్‌పై వర్ధన్నపేట వైపునకు వెళ్లాడు. గమనించిన జంపరాజు చిన్నాన్న సాయిగణేశ్ 100కు కాల్ చేయగా సమాచారం అందుకున్న వర్ధన్నపేట పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. జంపరాజును వర్ధన్నపేట కొత్త బస్టాండ్ సమీపం నుంచి వరంగల్ వైపునకు వెళ్తుండగా పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. అనంతరం జంపరాజుకు కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

చోరీకి గురైన ద్విచక్రవాహనం లభ్యం


రోడ్డు పక్కనే పడేసి పోయిన ద్విచక్రవాహనం

వర్ధన్నపేట: వర్ధన్నపేట పట్టణంలో బుధవారం రాత్రి చోరీకి గురైన ద్విచక్ర వాహనం కట్య్రాల గ్రామంలో లభ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం.. వర్ధన్నపేట పట్టణానికి చెందిన రామగిరి పరమేశ్వరచారి తన ఇంటిలోపల రేకుల షెడ్డులో బైక్ పార్కు చేశాడు. గురువారం తెల్లవారి జామున చూడగా పార్కు చేసిన బైక్ కనిపించకపోవడంతో 100కు కాల్ చేసి సమాచారం ఇచ్చాడు. స్థానిక పోలీసులు స్పందించి సీసీ పుటేజీని పరిశీలించగా చోరీకి గురైన ద్విచక్రవాహనం గ్రామ సమీపంలోని రోడ్డు పక్కకు పడేసి పోయారు. ద్విచక్రవాహనాన్ని బాధితుడు పరమేశ్వరచారికి అప్పగించారు. ఇటీవల సైతం కొత్త బస్టాండ్ సమీపంలో ఓ బైక్ చోరీకి గురై లభ్యమైంది.

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సిబ్బందిపై దాడి

నెహ్రూసెంటర్: జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సిబ్బందిపై పేషెంట్ బంధువులు దాడి చేసిన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పేషెంట్‌కు సంబంధించిన బంధువులు ఎక్కువ మందిని ఆస్పత్రి సిబ్బంది లోపలికి అనుమతించలేదు. దీంతో వారు వినకుండా గొడవకు దిగి దాడి చేశారు. దీంతో ఆస్పత్రిలో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో 100కు డయల్ చేయగా పోలీసులు వచ్చి ఇద్దరిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆస్పత్రి సిబ్బందిపై దాడి సంఘటనపై ఆస్పత్రి సిబ్బంది టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.